# కరుణించిన కనకదుర్గ

-కాకాని కమల

సాయంత్రం అయిదు దాటుతోంది.

క్రమంగా మసక చీకట్లు అల్లుకుంటున్నాయి. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ స్పెషల్ రూమ్‌లో కిటికీ దగ్గర కూర్చుని రోడ్డుమీదకి చూస్తోంది హిమజ.

ఎదురుగా ఇంటెన్సివ్ కేర్‌లో గాఢ సుషుప్తిలో వున్నట్టు పడుకుని వున్నాడు భర్త నాగేందర్.

అతను ఆరునెలల నుంచి అలా నిద్రపోతున్నట్లు పడుకునే వున్నాడు.

నాగేందర్ ఆరునెలల క్రితం కోమాలోకి వెళ్లాడు. నిపుణులైన ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో అతనికి గత ఆరునెలలుగా వైద్యం జరుగుతోంది.

ఈరోజు మధ్యాహ్నం అతడి మెదడుకు ఆపరేషన్ అయింది. నాలుగు గంటలకుపైగా ఆపరేషన్ జరిగింది. కొద్ది నిముషాల క్రితమే నాగేందర్‌ని తెచ్చి ఇంటెన్సివ్ కేర్‌లో పెట్టారు.

ఎనిమిది నెలల క్రితమే నాగేందర్‌కి హిమజకి వైభవంగా వివాహం జరిగింది. నాగేందర్ కేంద్ర ప్రభుత్వంలో మంచి ఉద్యోగి. హిమజ కూడా బాగా చదువుకున్నదే. పెళ్లి కాగానే కాపురానికి వచ్చేసింది. అత్త, మామగారు, ఆడబిడ్డ, మరిది అందరూ కలిసే ఉంటారు. ఇంట్లో భర్త, అత్తమామలు అందరూ ప్రోత్సహించడంతో ఆమె కూడా ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టింది.

హిమజ కాపురానికి వచ్చిన రెండునెలలు ఆనందంగానే గడిచాయి. అత్తమామలుకూడా ప్రేమగానే చూస్తున్నారు. జీవితం ఆనందమయమే అనుకుంది.

కానీ సరిగ్గా ఆమె కాపురానికి వచ్చిన రెండునెలల తరువాత ఆ రోజు హిమజకి ఇప్పటికీ బాగా జ్ఞాపకమే.

ఆమె పచ్చని వైవాహిక జీవితంలో చిచ్చురేగిన ఆ రోజు దురదృష్టం ఆమెని వెక్కిరించింది.

ఆ రోజు శుక్రవారం.

రోజులాగే నాగేందర్ ఉదయం పదిగంటలకల్లా భోజనం కానిచ్చి ఆఫీసుకి బయలుదేరాడు.

హిమజ భర్తవెంట వీధి గేటుదాకా వచ్చింది అతన్ని సాగనంపడానికి. లంచ్ బాక్స్ అతని స్కూటర్ డిక్కీలో పెట్టింది. భర్త స్కూటర్ సందు మలుపు తిరిగేదాకా గేటు దగ్గరే నిల్చుని లోపలకు వచ్చింది.

అప్పటికే మామగారు ఆఫీసుకి, ఆడబిడ్డ, మరిది కాలేజీలకి వెళ్లగా అత్తగారు పూజలో వుంది. హిమజ ఇంటిపనిలో నిమగ్నం అయింది.

భర్త నాగేందర్ ఆఫీసుకి బయలుదేరి అరగంట కూడా కాలేదు. ఫోన్ మోగింది.

మాసిన బట్టలన్నీ సర్ఫ్‌లో వేస్తున్న హిమజ చేతిలో పని వదిలి ఫోన్ తీసింది.

అంతే!

''అత్తయ్యా!'' అంటూ వెర్రికేక పెడుతూ విరుచుకుని పడిపోయింది. ఆఫీసుకి బయలుదేరిన నాగేందర్ ఆబిడ్స్‌లో ఆక్సిడెంట్‌కి గురయ్యాడని పోలీసుల సమాచారం.

''ఇదెక్కడి ఖర్మ తల్లీ'' అంటూ హిమజ అత్తగారు గగ్గోలు పెడుతూ భర్తకి ఫోన్‌చేసి కోడల్ని తీసుకుని ఆసుపత్రికి వచ్చింది.

నాగేందర్ స్కూటర్ ఎదురుగా వస్తున్న ఒక బస్సుకి గుద్దింది. నాగేందర్ ఒంటికి చిన్నగాయం తగ్లలేదు. ఒక్క చుక్క రక్తం కూడా అతని శరీరం నుంచి చిందలేదు. కానీ అతని మెదడులోని చిన్నభాగం దెబ్బతింది. అతను స్పృహ కోల్పోయాడు.

ఆ నడిరోడ్డుమీద ఆక్సిడెంట్ అయిన ఆ క్షణం నుంచి ఈరోజుదాకా అంటే ఈ ఆరునెలలు అతనికి తిరిగి స్పృహ రాలేదు. కోమాలోకి వెళ్లాడని డాక్టర్ల కథనం.

ఈ ఆరునెలల నుంచి అతను అలా హాస్పిటల్ బెడ్ మీదే శవంలా పడి ఉన్నాడు. వైద్య పర్యవేక్షణలో వున్నాడు.

నాగేందర్‌కి చూపులేదు, పలుకులేదు, చలనంలేదు. కానీ అతనిలో జీవం వుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు యధావిధిగా ఆరోగ్యంగా జరుగుతున్నాయి. ద్రవరూపంలో వైద్యులు అతని దేహానికి ఆహారం అందిస్తున్నారు.

గాంధీ ఆసుపత్రి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి నాగేందర్‌ని తరలించారు. అతని ఆఫీసు మూడువంతుల వైద్య ఖర్చు భరిస్తుంది. మిగతా ఖర్చు కుటుంబం పెట్టుకోవాలి. వైద్యలోపం ఏమీలేదు. డాక్టర్లూ ఏమీ చెప్పలేకపోతున్నారు. మనిషి కోమాలోకి వెడితే స్పృహలోకి రావడం కష్టం అంటున్నారు.

నెలల తరబడి ఏళ్ల తరబడి కోమాలో వున్న పేషెంట్లు కూడా వున్నారుట. కోమా నుంచి తెలివి వచ్చి బ్రతికినవాళ్లూ వున్నారు. తెలివి వచ్చిన వెంటనే ఒకటి రెండు మాటలు మాట్లాడి మరణించిన వాళ్లూ వున్నారని అంటున్నారు.

అయితే డాక్టర్లు ఖచ్చితంగా ఎటూ చెప్పలేకపోతున్నారు.

ఇక కోమా గురించి బంధుమిత్రులు రకరకాలుగా చెబుతున్నారు.

నాగేందర్ మాత్రం ఆరునెలల నుంచి మూసిన కన్ను తెరవకుండా పలుకు లేకుండా అలా మంచంలో నిద్రావస్థలో కోమాలో వున్నాడు. అతని శరీర ఆరోగ్య స్థితి బాగానే వుంది.

కోమాలో వున్న నాగేందర్ స్థితితో పోలిస్తే స్పృహలో వున్న హిమజ పరిస్థితి మాత్రం దుర్భరంగా వుంది.

అటు అత్తమామలు, బంధుమిత్రులు, ఇటు తల్లిదండ్రులు అందరూ ఆమెని శత్రువుని చూసినట్లు చూస్తున్నారు.

పెళ్లయిన వేళా విశేషం అని, పెళ్లయిన రెండునెలలకే ఇలా జరగడం దురదృష్టం అని జాలి పడుతూనే హిమజ పాదం మంచిది కాదనీ, కోడలు వచ్చిన వేళ గొడ్డు వచ్చిన వేళ అని పెద్దలు ఊరికే అనలేదని ఇలా రకరకాలుగా హిమజనే నిందిస్తున్నారు.

హిమజకి చచ్చిపోదామనిపించిన క్షణాలు ఎన్నో ఈ ఆరునెలల్లో.

బంగారంలాంటి తన కొడుకుని పొట్టన పెట్టుకుందుకు వచ్చిన మహమ్మారిని చూసినట్లు చూస్తోంది అత్తగారు.

హిమజ తల్లి కూడా దాదాపు అలాంటి సూటిపోటి మాటలే అని వెళ్లింది.

హిమజ మనసు ఘోష అలవికానిది. కోటి కోర్కెలతో పెళ్లి చేసుకుని అత్తింటికి వచ్చింది. తన భర్తకి ఇలా జరగాలని అనుకుందా? అతనికి మంచి జరిగినా, చెడు జరిగినా అది తనకే వర్తిస్తుంది కదా?

అటువంటిది అతని నాశనం తనెందుకు ఆశిస్తుంది? గత ఆరునెలలుగా మంచంలో కోమాలో వున్నాడు నాగేందర్.

అయితే ఇలా ఎన్నాళ్లు?

ఇప్పుడు చాలా ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. నాగేందర్ మెదడులో సున్నితమైన భాగమేదో దెబ్బతింది. అతని మెదడుకి ఆపరేషన్ చేస్తే ఫలితం వుంటుందని డాక్టర్లు చెబుతున్నారు.

ఆపరేషన్ చేయకపోతే అతను కోమాలోంచి బయట పడడం కష్టమని, బ్రతికిన సంఘటనలు చాలా తక్కువ అని చెబుతున్నారు డాక్టర్లు.

ఆపరేషన్ చేస్తే కోమా నుంచి బయటపడతాడని ఖచ్చితంగానే చెబుతున్నారు.

అయితే డాక్టర్లు ఇంకోమాట కూడా అంటున్నారు.

ఆపరేషన్ సక్సెస్ అయి అతను కోమాలోంచి తేరుకున్నా కొన్ని కేసుల్లో పేషెంట్ కొద్ది గంటలు స్పృహలో వుండి మరణించిన అవకాశం కూడా లేకపోలేదని చెబుతున్నారు. ధైర్యం చెబుతూనే మరో ప్రక్క అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు డాక్టర్లు.

అందువల్ల అతనికి ఆపరేషన్ చేయించడానికి అనుమానించాల్సి వస్తోంది.

దాంతో నాగేందర్ తరపువాళ్లు ఇటు హిమజ తరపు బంధువులు, నాగేందర్ ఆఫీసువాళ్లు అందరూ చాలారోజులు తర్జన భర్జనలు చేసి చివరికి మెదడుకి ఆపరేషన్

చేయించడమే మంచిదని నిర్ణయించారు.

అందుకు అవసరమైన పత్రాలన్నింటిమీదా నాగేందర్ బంధువర్గం చేత సంతకాలు చేయించుకున్నారు.

నిర్ణయించిన తేదీ ప్రకారం ఈ రాత్రికే అతని మెదడుకి ఆపరేషన్ జరగబోతోంది. అమెరికాలో తర్ఫీదు పొందిన వైద్య నిపుణుల బృందం ఆ ఆపరేషన్ చేస్తోంది. ఇంకొద్దిసేపట్లో నాగేందర్‌ని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకుని వెళతారు.

హిమజని నాగేందర్ దగ్గర కాపలాపెట్టి హిమజ అత్తగారు ఇంటికి వెళ్లింది. మామగారు మందులు తేవడానికి వెళ్లారు. అందరూ తెల్లవార్లూ హాస్పిటల్‌లోనే వుంటారు. ఆపరేషన్ అయిన నాలుగు గంటలలోగా ఎప్పుడైనా నాగేందర్‌కి మెలకువ రావచ్చు.

హిమజ తల్లిదండ్రులకు ఫోన్స్ వెళ్లాయి. ఇంకో గడియకు వాళ్లు వస్తారు.

హిమజకి భర్తని చూస్తుంటే దుఃఖం వస్తోంది. అతనికి తనవల్లనే ఇలా జరిగిందా? అందరూ అంటున్నట్లు తన పాదం మంచిదికాదా?

ఆమె మనసు మూగగా రోదిస్తోంది. ఆరునెలలుగా జీవితం నరకంలా వుంది.

అత్తింటివారితోపాటు అయినవారు కూడా ఆమెని చూపులతోనే హింసిస్తున్నారు.

కడుపునిండా అన్నం తినడం, అందంగా అలంకరించుకోవడం మర్చిపోయింది. నిన్నగాకమొన్న ముడిపడ్డ తనకే అతని దుస్థితి బాధాకరంగా వుంది. కన్నవారి బాధను అర్థం చేసుకోగలదు. చెట్టంత కొడుకు, సంపాదించే కొడుకు నూరేళ్లు ఆనందంగా బతకవలసిన కొడుకు మృత్యువాత పడితే బాధే. కానీ... ఇందులో తన బాధ్యత ఎంత? అసలు తన జీవితం ఎందుకిలా అయింది?

ఈ రాత్రికి తన జాతకం ఏమిటో తెలిసిపోతుంది. ఆపరేషన్ సక్సెస్ అవుతుందా? లేక...?


తన భర్త కోమా నుంచి తేరుకుంటే సరే. అలా కాకుంటే తన బ్రతుకు ఏమిటి?

ఈ మనుష్యుల మధ్య తను బ్రతగ్గలదా? తనేం తప్పు చేసిందని భగవంతుడు తనకీ శిక్ష విధించాడు. హిమజ కన్నీటిని అదుముకుంటుంటే కిటికీలోంచి బయటకి చూసింది.

దూరంగా అమ్మవారి ఆలయం. గాలిలో తేలుతూ జేగంటల ధ్వని వినిపిస్తోంది.

హిమజ ఆవేశంగా లేచి రోడ్డుమీదకి వచ్చింది. వేగంగా నడుస్తూ రోడ్డు దాటి గుళ్లోకి వచ్చింది. చీకట్లు ముదరడంతో వీధిదీపాలు వెలిగాయి.

మంగళవారం కావడంతో ఆలయం సువాసనలతో కిటకిటలాడుతోంది.



హిమజ పూలు టెంకాయ కొని కాళిమాత ఆలయంలోకి వచ్చింది. చేతులనిండా ఆయుధాలతో కాళీమాత నల్లని విగ్రహం. ఎర్రరాళ్ల ముక్కు బేసరి. తెల్లరాళ్ల నత్తు. అమ్మవారి అలంకరణ దివ్యమంగళ రూపంగా.

భక్తులు అదేపనిగా గంటలు మోగిస్తున్నారు.

పూజారి హారతి ఇచ్చి గంట వాయిస్తున్నాడు.

భక్తులు పారవశ్యంతో కీర్తిస్తున్నారు. పూజారి హిమజ నుదుట కుంకుమ పెట్టి ప్రసాదం దోసిట్లో పెట్టాడు.

పూజారి పెట్టిన నిలువుబొట్టు హిమజ నుదుటి మీద అగ్నిశిఖలా వెలుగుతోంది. అమ్మవారి ముందు వెలుగుతున్న హారతి ఆమె కళ్లల్లో ప్రతిఫలిస్తోంది.

రెండు చేతులు జోడించి ఎదురుగా వున్న అమ్మవారి విగ్రహంలోకి దీక్షగా చూసింది హిమజ.

''తల్లీ! నా భర్తని రక్షించు. కావాలంటే బదులుగా నా ప్రాణం తీసుకో. అతన్ని బలి తీసుకున్నానన్న అపఖ్యాతి నాకు రానీయకు''

ఒక రెండు నిముషాలు గుడిమెట్లమీద కూర్చుని గబగబా రోడ్డుమీదకి వచ్చింది.

ఈ పాటికి ఆయన్ని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకువెళ్లడానికి సిద్ధం చేస్తున్నారేమో. వెళ్లాలి.

ఏదో శక్తి ఆవహించినట్లు ఉన్మాదిలా రోడ్డుమీదకి వచ్చింది.

రాత్రి ఏడుగంటలు కావస్తోంది.

రోడ్లన్నీ రద్దీగా వున్నాయి.

వచ్చిపోయే బస్సులు, కార్లు, మోటారు వాహనాలు... జనం అంతా హడావుడి. కాలంతో పరుగులు. సమయానికి గమ్యం చేరుకోవాలన్న హడావుడి. అందరికీ ఆత్రం.

హిమజలో కూడా అంతు తెలియని ఆదుర్దా. తొందరగా వెళ్లాలి. భర్త ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లేలోగా అమ్మవారి కుంకుమ అతని నుదుట పెట్టాలి.

తొందరగా వెళ్లాలి అనుకుంటూ వేగంగా రోడ్డు దాటబోయింది. ఒక అడుగువేసింది. ఇంకో అడుగు పడనేలేదు.

కీచుమంటూ పెద్ద శబ్దం. ''అమ్మా'' అన్న పెద్ద కేక రెండూ కలిసిపోయాయి.

రోడ్డుమీది వాహనాలన్నీ ఎక్కడికక్కడ సడెన్ బ్రేకులతో ఆగిపోయాయి.

ట్రాఫిక్ పోలీసులు నాలుగు మూలల నుంచి విజిల్సు వూదుతూ పరుగు పరుగున వచ్చారు.

ఆక్సిడెంట్...ఆక్సిడెంట్.

''పాపం ఎవరో స్త్రీ. గుడికి వచ్చినట్టుంది. బస్సు చక్రాల కింద నజ్జు నజ్జు అయిపోయింది. పాపం చాలా చిన్న వయసుదాన్లా ఉందమ్మ. ఏ తల్లి బిడ్డో. సరిగ్గా గుడి ముందు చచ్చిపోయింది. పుణ్యాత్మురాలు...''

బస్సు మందు చక్రం హిమజ నడుం మీంచి దొర్లింది. ఆమె నాజూకు దేహం రెండు భాగాలుగా విడిపోయింది.

కానీ బిగుసుకున్న ఆమె గుప్పిట్లో మాత్రం అమ్మవారి కుంకుమ పొట్లం, పూలు భద్రంగా అలాగే వున్నాయి.

★